పనివేళలను వ్యతిరేకించిన ఐఎన్‌టీయూసీ 6లో..

రూ.కోటి 75 లక్షలకు పైగా నగదు జప్తు : కలెక్టర్ 6లో..

ఐదు నిమిషాల్లో.. ఇంటికి చేరుకుంటామనేలోపే..

- కంకుల లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్ బోల్తా
- ముగ్గురు మహిళలు మృతి
- నలుగురికి తీవ్ర గాయాలు
- చిన్నబొంకూర్లులో విషాదం


కాలువలో బోల్తా పడిన ట్రాక్టర్


పోచంపల్లి రాజమ్మ


భేతి లక్ష్మి


మల్యాల వైష్ణవి

సుల్తానాబాద్, మే 5: మరో ఐదు నిమిషాలలో.. ఇంటికి చేరుకుంటామనగా.. మృత్యువు వారిని కబ ళించింది.. ఎండలు మండుతుండడంతో ఓవైపు పనులు లేక.. ఉన్నా పోలేని పరిస్థితిలో.. ఉదయం ఐదు గంట లకు వెళ్లి మళ్లీ ఎండ ఎక్కువ కాకముందే ఇంటికి చేరుకోవచ్చనే ఉద్దేశ్యంతో వ్యవసాయ కూలీ పనులకు వెళ్లారు వారు.. కానీ ఇలా ప్రమాదం బారిన పడి వారు మృత్యువాత పడతారని ఊహించలేకపోయారు.. కుటుంబ అవస రాలకు ఆసరగా ఉంటుందని నాలుగు వందల రూపాయల కోసం వ్యవసా య పనులకు వెళ్లిన మహిళలు విధి వక్రీకరించి మృత్యువాత పడ్డారు. ఉదయం ఐదు గంటలకు వెళ్లి తిరిగి పది గంటలకు ఇంటికి చేరుకుంటా మని భావించారు. కానీ మరో ఐదు నిమిషాలలో ఇంటికి చేరుకుంటామనే లోపే వారిని విధి వక్రీకరించి ప్రమాద రూపంలో పొట్టన పెట్టుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సుల్తానాబాద్ మండలంలోని చిన్నబొంకూరు గ్రామానికి చెందిన మల్యాల వెంకటేశం అనే రైతు మియాపూర్ శివారులోని భూమిని కౌలుకు తీసుకుని మొక్కజొన్న పండించాడు. కంకుల కోతలు కూడా ముగిశాయి. ఆదివారం చిన్నబొంకూరు గ్రామానికి చెందిన ఆరుగురు మహిళలను మక్క కంకుల పొట్టు ఒలిచే పని కోసం తీసుకెళ్లారు. ఎండలు మండిపోతుండడంతో ఉదయం ఐదు గంటలకే చిన్నబొంకూరు గ్రామానికి చెందిన పోచంపల్లి రాజమ్మ భేతి లక్ష్మి, పోచంపల్లి పద్మ, విజ్జగిరి రమ, విజ్జగిరి రాజమ్మ, పోచంపల్లి లక్ష్మితో పాటు వెంకటేశం భార్య మల్యాల వైష్ణవిలు వారి ట్రాక్టర్‌లో మియాపూర్‌లోని మక్కచేను వద్దకు చేరుకున్నారు. కంకుల పొట్టు ఒలిచి కంకులను ట్రాక్టర్‌లో లోడ్ చేసుకున్నారు. ట్రాలీలో ఉన్న కంకులపైన మహిళలకు కూర్చోగా వెంకటేశం ట్రాక్టర్‌ను నడుపుతున్నాడు. ఎస్సారెస్పీ ఉపకాలువ 33ఎల్ పైనుంచి ట్రాక్టర్ వెళుతుండగా అదుపుతప్పి కాలువలో బోల్తా పడింది. దాంతో ట్రాలీలో కంకులపై కూర్చుని ఉన్న మహిళలు కాలువలో పడిపోయి వారిపై కంకులు, ట్రాలీ పడడంతో పోచంపల్లి రాజమ్మ(61), బేతి లక్ష్మి(50), మల్యాల వైష్ణవి(35)లు అక్కడికక్కడే మృతిచెందారు. పోచంపల్లి పద్మ, విజ్జగిరి రమ, విజ్జగిరి రాజమ్మ, పోచంపల్లి లక్ష్మిలు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోచంపల్లి పద్మ, విజ్జగిరి రమ పరిస్థితి బాగా లేకపోవడంతో వారిన కరీంనగర్ అస్పత్రికి తరలించారు. మృతుల్లో రాజమ్మకు శ్రీనివాస్, నరేష్ అనే కొడుకులు. భర్త ఐదేళ్ల క్రితమే చనిపోయారు. ఇక బేతి లక్ష్మికి భర్తతో పాటు కొడుకు వేణు, కూతురు ఉమ ఉన్నారు. మల్యాల వైష్ణవికి భర్త, కొడుకు, కూతురు ఉన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు, చిన్నబొంకూరు గ్రామస్తులతో సుల్తానాబాద్ ఆస్ప త్రి ఆవరణ నిండిపోయింది.

● ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల పరామర్శలు

ప్రమాద విషయాన్ని తెలుసుకున్న పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి తదితరులు ఆస్పత్రికి వచ్చి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. గాయపడిన వారిని కలిసి సానుభూతి వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని డాక్టర్లకు సూచించారు. కాగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ తదితర పార్టీల నాయకులు, ప్రజాప్రతినిదులు బాధితులను పరామర్శించారు.

కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి

- పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ - ఖనిలో బైక్ ర్యాలీ


మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణ


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వంశీ, మక్కాన్‌సింగ్

గోదావరిఖని, మే 5:సింగరేణి కార్మికుల సమ స్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని, కార్మికు లకు ఎళ్లప్పుడూ అండగా ఉంటామని ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ అన్నారు. ఆదివారం గోదావరిఖని చౌరస్తా నుంచి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌తో కలిసి మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభు త్వంలో పదేళ్ల సింగరేణిలో ట్రాన్స్‌ఫర్ కావాల న్నా, డిపెండెంట్ ఉద్యోగాలు కావాలన్నా లంచా లు తీసుకునేవారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత పారదర్శకంగా డిపెండెంట్ ఉద్యోగాలు ఇవ్వడం జరుగుతుందని, సింగరేణిలో ఇక నుం చి అవినీతికి తావులేదన్నారు. సింగరేణి కార్మికు లు ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న ఇన్‌కం టాక్స్ రద్దును కూడా చేయనున్నట్లు తెలిపారు. తనను భారీ మెజార్టీతో సింగరేణి కార్మికులు, రామగుండం ప్రజలు గెలిపించాలని కోరారు. జనగామ శ్రీను, కృష్ణ ఆధ్వర్యంలో ఈ బైక్ ర్యాలీ లో మేయర్ బంగి అనీల్ కుమార్, కాంగ్రెస్ కార్పొరేటర్ మహంకాళి స్వామి, నాయకులు కాల్వ లింగస్వామి, తిప్పారపు శ్రీనివాస్, పెద్దెల్లి ప్రకాష్, ఉన్నికృష్ణన్, రొడ్డ శ్రీనివాస్, కళ్యాణి సిం హాచలం, కామ విజయ్ పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

పాలకుర్తి, మే 5: పార్లమెంటు ఎన్నికల్లో తన ను గెలిపిస్తే ఈప్రాంత నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేస్తానని పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వం శీకృష్ణ అన్నారు. ఆదివారం మండలం పరిధిలోని జయ్యారం గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13న జరిగే ఎన్నికల్లో తనను ఆశీర్వదించి గెలిపిస్తే ఈ పాంత నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశా లు కల్పిస్తానని భరోసా ఇచ్చారు. పెద్దపల్లి ప్రాం త అభివృద్ధికి తన తాత కాకా వెంకటస్వామి పాటుపడిన విధంగా తాను కూడా పాటుపడు తానని పేర్కొన్నారు. రానున్న పార్లమెంటు ఎన్ని కల్లో ఘన విజయం సాధించి పెద్దపల్లిలో కాం గ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయమన్నారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చేతి గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృ ష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ముక్కె ర శ్రీనివాస్‌గౌడ్, పుట్నూర్ ఎంపీటీసీ గంగాధరి రమేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే..

అంతర్గాం, మే 5: త్వరలో కేంద్రంలో ఏర్పా టుకానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఎగ్లాస్‌పూర్, ఆకెనపల్లి, బ్రా హ్మణపల్లి, సోమనపల్లి, పొట్యాల గ్రామాల్లో పె ద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్, బీ జేపీలు పదేళ్లపాటు ప్రజలను మోసం చేశాయ న్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకు లు పెండ్యాల మహేష్, గుంట బాపు, జూల లింగయ్య, సింగం కిరణ్‌గౌడ్, బరుపటి తిరుప తి, శ్రీనివాస్, లచ్చయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన ఏఎంసీ మాజీ చైర్మన్

పెద్దపల్లిటౌన్, మే 5: బీఆర్ఎస్‌కు చెందిన వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జడల సురేందర్ ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆర్కే గార్డెన్లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సురేందర్‌తో పాటు పలువురికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో అమలపురపు ఆనంద్, సుధాకర్ జయ ప్రకాష్, సుధాకర్ శ్రీకాంత్, దేవనంది సంతోష్, కొట్టే రవి, అడప సంతోష్, అన్వర్, రాజు, దత్తు, సంతోష్, చెలుకల సదయ్య, ఎస్.కే ఆరిఫ్, చారీ, జావేద్, సోమ శ్రీకాంత్, మాడిషెట్టి తిరుపతి, తాళ్ళ కళ్యాణ్, దేవనంది నవీన్, దేవనంది దేవరాజు, వరాల శ్రవణ్, భుత్యూరి రాజు మరియు వారితో పాటు 150 మంది పై చిలుకు బి.ఆర్.ఎస్ కార్యకర్తలున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్స్ జెడ్పీటీసి లు, కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే విజయరమణారావు

గడ్డం వంశీకృష్ణ గెలుపునకు కృషి చేయాలి

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


మాట్లాడుతున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మారం, మే 5: పెద్దపల్లి ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణ గెలుపునకు అన్ని వర్గాల ప్ర జలు కృషి చేయాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరారు. ఆది వారం ధర్మారంలోని గౌతమబుద్ధ ఫంక్షన్‌హాల్ లో జరిగిన ఎన్నికల ప్రచారంలో భాగంగా వ ర్తకవ్యాపారుల సమావేశంలో ఆయన మాట్లా డారు. కాంగ్రెస్ ప్రభుత్వ అధి కారంలోకి వచ్చిన వెంటనే ఇ చ్చిన హామీల్లో ఆరు గ్యారంటీ 4 పథకాలను అమలు చేయ డం జరిగిందని ఆయన చెప్పా రు. మిగతా వాటిని కూడా త్వ రలోనే అమలుచేయడం జరు గుతుందని ఆయన తెలిపారు. ప్రజా కుటుంబం నుంచి వచ్చి న వివేక్ కుమారుడు, కాకా వెంకటస్వామి మనుమడు వంశీకృష్ణను పెద్దపల్లి ఎంపీగా అత్యధిక మె జార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరపతిరెడ్డి,, నాయకులు దేవి జనార్ధన్, సోగాల తిరుపతి, వర్తక వ్యాపారులు పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో భక్తుల పూజలు


పట్నాలు వేస్తున్న ఒగ్గు పూజారులు

ఓదెల, మే 5 : మండల కేంద్రంలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి క్షేత్రంలో ఆదివారం భక్తులు పూజ లు నిర్వహించారు. వేసవి తీవ్రత కారణంగా భక్తులు నామమాత్రంగా స్వామివారిని దర్శించుకున్నారు. ఇత ర మండలాలకు చెందిన భక్తులు వాహన పూజలు, కోడె మొక్కులు, ఒగ్గు పూజారులతో పట్నాలు వేయిం చి మొక్కులు చెల్లించుకున్నారు. అక్కడికి వచ్చిన భక్తు లు చెట్ల కిందనే ఉంటూ దర్శనానికి వచ్చేందుకు ఎం డ ప్రభావంతో ఇబ్బందులు పడ్డారు.

'ప్రభుత్వరంగ సంస్థలను అమ్మివేస్తున్న బీజేపీ'


కాంగ్రెస్‌లో చేరిన వారితో వంశీకృష్ణ, మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, మే 5: బీజేపీ అధికారం లోకి వచ్చిన తరువాత ప్రభుత్వరంగ సం స్థలను అమ్మివేసిందని రామగుండం ఎ మ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నా రు. ఆదివారం లయన్స్‌క్లబ్, గోదావరిఖని కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీతో కలిసి ఆయన ము ఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశం లో బీఎస్ఎన్ఎల్, ఓడరేవులు, విమాన యాన సంస్థలు, ఎల్ఐసీని ప్రైవేట్‌పరం చేశారని, అందులో పని చేస్తున్న కార్మికులను బజా రున పడవేశారని ఆయన విమర్శించారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాల అమలులో గత బీఆర్ ఎస్ ప్రభుత్వం విఫలమైందని, గోదావరిఖనిలోని వ్యాపార సంస్థ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. రామగుండానికి పూర్వవైభవం తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు, రూ.400కోట్లతో రామగుం డం నియోజకవర్గాన్ని త్వరలోనే అభివృద్ధిని చేస్తాన ని హామీ ఇచ్చారు.

కాంగ్రెస్‌లో చేరిన కాంట్రాక్టు కార్మికులు

మాజీ కార్పొరేటర్ దాసరి ఉమాదేవి సాంబమూ ర్తి ఆధ్వర్యంలో వంద మంది కాంట్రాక్టు కార్మికులు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సమక్షంలో కాం గ్రెస్ పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వా నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజు ల్లోనే ఐదు పథకాలను అమలు చేసిందని, అవి విజయవంతంగా కొనసాగుతున్నాయని చెప్పారు. నిరుపేదలకు త్వరలోనే ఇండ్లను కూడా ఇస్తామని చెప్పారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో రాజేశం, వెంక టేషం, బత్తుల స్వామి, శేఖర్, వెంకటస్వామి, మల్లే ష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించిన బీజేపీకే మద్దతు ఇవ్వాలి

- మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి

గోదావరిఖని, మే 5: చట్ట సభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పిం చిన భారతీయ జనతా పార్టీకి మహిళలు మద్దతు ఇవ్వాలని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి పిలుపుని చ్చారు. ఆదివారం గోదావరిఖని మార్కెండే య కాలనీలోని ఒక ఫంక్షన్‌హాల్‌లో పెద్దప ల్లి పార్లమెంట్ బీజేపీ మహిళ మోర్చా కన్వీనర్ సోమారపు లావణ్య ఆధ్వర్యంలో పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి మహిళా శక్తి సమ్మేళనం నిర్వహించారు.

ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హా జరైన శిల్పారెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గోమాసే శ్రీని వాస్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. బీజేపీ మహిళా మోర్చా ప్రభారీ నళిని, జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి, నాయ కులు సోమరపు లావణ్య, బల్మూరి వనిత, విజయభవాని, జడ్పీటీసీ కందుల సంధ్యా రాణి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల సంక్షేమం, అభివృద్ధి

- పెద్దపల్లి అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జి ఆరెపల్లి మోహన్

పెద్దపల్లిటౌన్, మే 5: కాంగ్రెస్ పార్టీతోనే పేదల సంక్షేమం, అభివృద్ధి జరు గుతుందని కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జి, మానకొం డూరు మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ పేర్కొన్నారు. మరో ఇన్‌చార్జీ రొయ్యలపల్లి మల్లేష్‌గౌడుతో కలిసి జిల్లా కేంద్రంలోని ఆర్కే గార్డెనులో ఆది వారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలోని అన్ని రంగాలను ప్రయివేటీకరణ పేరుతో అమ్మకాలకు పెడుతున్నారని విమర్శిం చారు. బీజేపీకి 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చుతుందని ఆరోపించారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ ఇచ్చిన వాగ్దానాలైన ఆరు గ్యారెంటీలకు ఇప్పటికే ఐదు అమలుచేసినట్లు తెలిపారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచిన ప్రతి వాగ్దానాన్ని తప్పకుండా అమలు చేసే ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని వివరించారు. పెద్దపల్లి పార్లమెంట్‌లో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీని గెలుపుతోనే అన్ని వర్గాలకు సంక్షేమం సాధ్య మవుతుందన్నారు. పదేళ్ల పరిపాలించిన బీజేపీ ప్రభుత్వం క్రూడాయిల్ ధర లు తగ్గినా ప్రజలమీద పెట్రోల్, డీజిల్ భారాన్ని తగ్గించలేదన్నారు. బీజేపీ చేప్పే మాటలకు చేసే పనులకు పొంతన ఉండదన్నారు. ఇక బీఆర్అస్ ప్రభుత్వం పదేళ్లలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో నే ప్రజలు బుద్ధిచెప్పి కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారన్నారు. కాంగ్రెస్ హ యాంలో నిర్మించిన ఏ ఒక్క ప్రాజెక్టు కూడా ఇంతవరకు చెక్కుచెదరలేద న్నారు. కానీ మాజీ సీఎం కేసీఆర్ తన మెదడును పెట్టి నిర్మించానని చెప్పు కున్న కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయే పరిస్థితి దాపురించిందన్నారు. ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు నాయకత్వంలో పెద్దపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు అత్యధిక మెజార్టీ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అసత్యాలు ప్రచారం చేస్తున్న బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను పక్కన పెట్టి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీని భారీ మెజారిటీతో గెలిపించాలని వారు కోరారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆరెపల్లి మోహన్

ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు భూషణవేన సురేష్ గౌడ్, మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ నూగిల్ల మల్లయ్య, టీపీసీసీ సెక్రెటరీ భూషనవేణ రమేష్‌గౌడ్, మైనారిటీ నాయకుడు అక్బర్ అలీ, మహిళా నాయకురాలు ఈర్ల స్వరూప కౌన్సిలర్లు తూముల సుభాష్, నెత్తెట్ల కుమార్,తాడూరి శ్రీమాన్, బొడ్డుపల్లి శ్రీనివాస్, నాయకులు దొడ్డుపల్లి జగదీష్, కొలిపాక సంపత్, కుమార్ గౌడ్, నదీం, అస్లాం, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజ్ఞ వేసవి శిక్షణా శిబిరం ప్రారంభం

కరీంనగర్ కల్చరల్, మే 5: జెట్-వికాసతరంగిణి -108, వావిలాలపల్లి శాఖ ఆధ్వర్యంలో ప్రజ్ఞ వేసవి శిక్షణా శిబిరాన్ని ఆదివారం జ్యోతీనగర్‌లోని ఆండాళ్‌గోష్ఠిలో శాఖ చీఫ్ కో ఆర్డినేటర్ అరుణా భూపతిరావు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నైతిక విలువలను పెంపొందించే ఈ శిక్షణను వినియోగించుకోవాలని, నేర్చుకున్న అంశాలను ఆచరణలో పెడుతూ అభివృద్ధి పథంలో పయనించాలని అన్నారు. ఈ నెల 20వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 8 నుంచి 16 సంవత్సరాల బాలబాలికలు శిక్షణకు అర్హులని, శిక్షణలో శ్లోకాలు, కీర్తనలు, భజనలు, నైతిక కథలు, యోగ, ధ్యానం, పండు గల విశిష్ఠత, రామాయణ, భారత, భాగవతాల్లోని అంశాలు, ఋషుల చరిత్ర లు, ఆటలు నేర్పుతారని పేర్కొన్నారు. బాల బాలికలు పేర్లను ఆండాళ్‌గోష్ఠిలో నమోదు చేసుకోవాలని కోరారు.

దివ్యాంగులకు కుటుంబసభ్యుడిలా అండగా ఉంటా

- రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ముత్తినేని వీరయ్య

ధర్మపురి, మే 5: దివ్యాంగులకు కుటుంబసభ్యుడిలా ఎళ్లవేళలా అండగా ఉంటానని రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. ధర్మపురి పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు, వితంతువులకు, వృద్ధులకు, గీత కార్మికులకు మొదట పెన్షన్ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయే అని ఆయన పేర్కొన్నారు. దివ్యాంగులకు ప్రభుత్వం హోం హాస్టల్‌లో, విద్యలో, ఉద్యోగంలో రిజర్వేషన్ ఇచ్చింది కాంగ్రెస్ అని ఆయన అన్నారు. కేసీఆర్ ఏనాడు సీఎం హోదాలో ప్రపంచ వికలాంగుల దినోత్సవానికి హాజరు కాలేదని ఆయన తెలిపారు. వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయకపోవడం వల్ల నిరుద్యోగ దివ్యాలాంగులు బొమ్మకంటి మహేందర్, రాగుల రామ్మోహన్ ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

వికలాంగుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖను ఎత్తివేసి స్త్రీ శిశు సంక్షేమ శాఖలో విలీనం చేసిన చరిత్ర కేసీఆర్‌దేనని ఆయన అన్నారు. కేసీఆర్, బీజేపీ దివ్యాంగుల ద్రోహులని ఆయన తెలిపారు. పెరిక కులానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం గొప్ప నిర్ణయమని, అందుకే పెరికల కులస్థుల మద్దతు కాంగ్రెస్‌కు ఉంటుందని ఆయన అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జిల్లా పెరిక కుల నాయకులు అంకతి గంగాధర్, రాందేని మొగిలి, ముద్దసాని అజయ్, అక్కల లింగన్న, గోల్ల శ్రీకాంత్, రఘు, అనిల్, శరత్, శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి, యువతను విస్మరించిన బీజేపీని ఓడించాలి

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కసిరెడ్డి మణికంఠరెడ్డి

భగత్‌నగర్, మే 5: విద్యార్థి, యువతను విస్మరించిన బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో కరీంనగర్, సిద్దిపేట, సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల ఆఫీస్ బేరర్ల సమావేశం లో నిర్వహించారు. ఈ సందర్భంగా మణికంఠరెడ్డి మాట్లాడు తూ విద్యార్థులను బీజేపీ మతం పేరిట రెచ్చగొట్టడం తప్ప సంక్షేమానికి చేసిందేమీ లేదన్నారు. విద్యార్థి యువత పార్లమెంట్ ఎన్నికల్లో మార్పునకు సిద్ధం కావాలని ఇండియా కూటమి అభ్యర్థిని గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, మచ్చ రమేష్, జేరిపోతుల జనార్ధన్, సంగెం మధు, అక్రమ్ ప్రీతం, రంజిత్, మామిడిపల్లి హేమంత్, కనకం సాగర్, సాయి అజాద్ పాల్గొన్నారు.

కారు ఢీకొని మహిళకు గాయాలు

చందుర్తి, మే 5: చందుర్తి మండల కేంద్రంలో ఆదివారం జరిగిన బీఆర్ఎస్ ఆశీర్వాద సభకు హాజరై తిరిగి ఇంటికి వెళుతున్న మహిళలను కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం ప్రకారం.. మండలంలోని ఎనగల్ గ్రామానికి చెందిన బుర్ర లచ్చవ్వ మల్యాలశివారులో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ఆశీర్వాద సభకు ఆదివారం హాజరైంది. సభ ముగియడంతో రోడ్డుపైకి వచ్చింది. చందుర్తి వైపు వెళుతున్న కారు లచ్చవ్వను ఢీకొట్టడంతో కాలు విరిగింది. వేములవాడలోని ఏరియా ఆసుపత్రికి తరలించగా, అక్కడినుండి మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు.

మద్యం పట్టివేత

వీణవంక, మే 5: మండలంలోని పోతిరెడ్డిపల్లిలో పంజాల కుమారస్వామి అనే వ్యక్తి అక్రమంగా నిల్వ చేసిన మద్యాన్ని పోలీసులు ఆదివారం పట్టుకున్నాడు. కుమారస్వామి మద్యం విక్రయిస్తున్నాడని పక్కా సమాచారంతో తనిఖీ చేయగా సుమారు 16,120 రూపాయలు విలువ చేసే మద్యం పట్టుబడిందని పోలీసులు తెలిపారు. మద్యం స్వాధీనం చేసుకుని కుమారస్వామిని అదుపులోకి తీసుకున్నామని ఎస్సై తిరుపతి తెలిపారు.

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వాహనం తనిఖీ



ఆది శ్రీనివాస్ వాహనం తనిఖీ చేస్తున్న ఎన్నికల అధికారులు

వేములవాడ రూరల్, మే 5: ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వాహనాన్ని ఎన్నికల అధికారులు తనిఖీ చేసారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం వివిధ మండలాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొని వేములవాడకు తిరిగి వస్తున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వాహనాన్ని మర్రిపల్లి వద్ద ఎన్నికల అధికారులు తనిఖీ చేసారు. తనిఖీలు నిర్వహించడానికి ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అధికారులకు పూర్తిగా సహకరించారు.

రాష్ట్ర, జాతీయ స్థాయి తైక్వాండో క్రీడాకారులకు సన్మానం



క్రీడాకారులను సన్మానిస్తున్న అతిథులు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 5: రాష్ట్ర, జాతీయ స్థాయి, అంతర యూనివర్సిటీ తైక్వాండో పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులను ఆదివారం ఘనంగా సన్మానించారు. జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్ వివేకానంద విద్యానికేతన్‌లో కరీంనగర్ జిల్లా యాదవ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గెజిటెడ్ అధికారి శోభరాణి, వివేకానంద పాఠశాలల చైర్మన్ సొగాని కొమురయ్య, యాదవ ట్రస్టు అధ్యక్షుడు బబ్బురి కుమార్, బూస అంజయ్య పాల్గొని క్రీడాకారులు బబ్బురి అక్షిత, ప్రవళిక, ఎండి ఆస్మిన్, ఆఫియ, సుప్రియ, మహేశ్‌బాపు, హరి, హరిష్, తిరుమల్ కుమార్, రవీందర్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డి, ఉండాటి సిద్దులను శాలువా, మెమెంటోతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని తైక్వాండో క్రీడాకారులు జాతీయ, ఒలింపిక్ స్థాయి క్రీడల వరకు ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటేందుకు తైక్వాండో క్రీడాకారులకు మంచి శిక్షణ అందించాలన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు ప్రశంసాపత్రాలను అందచేశారు. కార్యక్రమంలో యాదవ హక్కుల పోరాట సమితి బండి మల్లయ్య, జిల్లా అధ్యక్షుడు దుండ్ర రాజయ్య, టౌన్ అధ్యక్షుడు గాలి రవి, కర్నాటకపు రాజయ్య, జంగ కొముకయ్య, మార్క వెంకటేశ్, బట్టి శంకర్ పాల్గొన్నారు.

సీఎస్ఐటీఏ ఎస్ఆర్‌బీవీఏ ఎన్నికలు

- ఉపాధ్యక్షుడిగా జి కృపాదానం ఎన్నిక



సీఎస్ఐటీఏ ఎస్ఆర్‌బీవీఏ ప్రతినిధులతో కృపాదానం

కరీంనగర్ కల్చరల్, మే 5: సీఎస్ఐటీఏ సౌత్ రీజియన్ బెన్ఫిషరీ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా కరీంనగర్‌కు చెందిన గుండ్ర కృపాదానం ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బెంగుళూరులో చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా ట్రస్టు అసోసియేషన్ బెన్ఫిషరీ వెల్ఫేర్ అసోసియేషన్ సౌత్ రీజియన్ బాడీ ఎన్నికలు ఆదివారం జరుగగా అధ్యక్షుడిగా బీసీ రవిచంద్రన్ (తమిళనాడు), ఉపాధ్యక్షుడిగా జి.కృపాదానం (తెలంగాణ), తెలంగాణ రీజియన్ ప్రధాన కార్యదర్శిగా జయపాల్ జయకుమార్ (తమిళనాడు), రాష్ట్ర ఉపకార్యదర్శిగా స్టాలిన్ (కర్ణాటక), కోశాధికారిగా ఏబెల్ (కర్ణాటక) ఎన్నిక కాగా తెలంగాణ రాష్ట్ర బాధ్యులుగా కొత్త విద్యాసాగర్ (హైదరాబాద్), అనిల్‌రాజ్ (మంచిర్యాల), జయపాల్ (వరంగల్) వి జాన్సన్ (కరీంనగర్) ఎన్నికయ్యారు. వీరంతా మూడు సంవత్సరాల పాటు పదవిలో ఉంటారు.

నేడు కరీంనగర్‌కు సీపీఐ జాతీయ కార్యదర్శి రాక

భగత్‌నగర్, మే 5: సోమవారం కరీంనగర్‌కు సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి రానున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్‌లోని పద్మనాయక కళ్యాణ మండపంలో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు నియోజకవర్గాల సీపీఐ గ్రామశాఖ, మండల కార్యదర్శిల, జిల్లా కార్యవర్గ కౌన్సిల్ సభ్యుల ప్రజాసంఘాల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఇండియా కూటమిలో సీపీఐ భాగస్వామిగా ఉన్నందున కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల గెలుపు కోసం సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. సీపీఐ శ్రేణులు సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మానవత్వం చాటుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్



రోడ్డుపై గాయాలతో పడి ఉన్న వ్యక్తి

కరీంనగర్ క్రైం, మే 5: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తన మానవత్వాన్ని చాటుకున్నారు. హుజురాబాద్ నుంచి ఎన్నికల ప్రచారాన్ని పూర్తి చేసుకొని కరీంనగర్ వెళ్తున్నారు. మార్గమధ్యంలో మానకొండూర్ మండలం సదాశివపల్లి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని అపస్మారక స్థితిలో ఓ వ్యక్తి పడి ఉన్నాడు. వెంటనే పొన్నం ప్రభాకర్ తన కాన్వాయ్‌ను నిలిపివేసి గాయపడ్డ వ్యక్తి పరిస్థితిని సిబ్బందితో కలిసి పరిశీలించారు. అంబులెన్స్ వచ్చేలోపు తన వాహనంలో గాయపడ్డ వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు. అనంతరం గాయపడ్డ వ్యక్తి వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గాయపడ్డ వ్యక్తిని ఆసుపత్రికి తరలించిన తరువాత మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. దీంతో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను అటుగా వెళ్తున్న ప్రయాణికులు కొనియాడారు.



గాయపడిన వ్యక్తిని తన వాహనంలో ఆస్పత్రికి తరలిస్తున్న మంత్రి పొన్నం

వెలగని ఎల్ఈడీ లైట్లు

- పట్టించుకోని కాంట్రాక్టర్...అధికారులు



జగిత్యాలలో వెలగని లైట్లు

జగిత్యాల, మే 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో రహదారి మ ధ్యన సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు ఏర్పాటు చేసిన ఎల్ఈడీ లైటింగ్ స్ట్రిప్స్ వెల గకుండా పోయాయి. కాసులకు కక్కుర్తి పడిన కాంట్రాక్టర్లు, అధికారులు నిర్లక్ష్యం కారణంగా నాణ్యత లోపంతో వాటర్ ప్రూఫ్ ఎల్ఈడీ స్ట్రిప్స్ ఏర్పాటు చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత యేడాది జూన్ మాసంలో పట్టణ ప్రగతి నిధు లతో సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు ఎల్ఈడీ లైట్ స్ట్రిప్స్‌ను ఏర్పాటు చేశారు. సు మారు రూ. 16.90 లక్షలతో పట్టణ శివారులోని దరూర్ గ్రామ శివారు నుంచి కొత్త బస్టాండు చౌరస్తా మీదుగా మంచినీళ్ల బావి వరకు రహదారి మధ్యన సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు ఎల్ఈడీ లైటింగ్ స్ట్రిప్స్‌ను ఏర్పరిచారు. ఒక్కో స్తంభా నికి కనీసం సుమారు 50 మీటర్ల పొడవుతో వాటర్ ప్రూఫ్ లైటింగ్ అమరిచారు. సంవత్సర కాలం పాటు వీటి పనితీరును చూడాల్సిన బాధ్యత సంబంధిత కాం ట్రాక్టరుకు అధికారులు అప్పగించారు. నాణ్యత లోపంతో ఏర్పాటు చేయడం కార ణంగా కొన్ని రోజులుగా స్ట్రిప్స్ పనిచేయడం లేదు. కాంట్రాక్టర్‌ను అధికారులు ప్ర శ్నించకపోవడం, పాలకవర్గంలో చోటుచేసుకున్న మార్పులు కారణంగా స్ట్రిప్స్ పు నరుద్ధరణ జరగడం లేదన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారు లు, ప్రజాప్రతినిధులు పట్టించుకొని లైటింగ్ స్ట్రిప్స్ పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో ఆటో డ్రైవర్ మృతి

- వైద్యుడు, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆందోళన
- ఆస్పత్రి సామగ్రి ధ్వంసం.. వైద్యుడిపై దాడి
- కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఉద్రిక్తం



ఆటోను అడుకుంటున్న ఆందోళనకారులు(ఇన్‌సెట్‌లో మృతి చెందిన రహిమాన్)

కోరుట్ల, మే 5 : పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరిన ఓ ఆటో డ్రైవర్ ఆదివారం మృతి చెందడంతో ఉద్రిక్తతకు దారి తీసింది. ఆస్పత్రి సిబ్బంది, వైద్యుడి నిర్లక్ష్యంతోనే మృతి చెందాడంటూ మృతుడి బంధువులు ఆందోళన చేపట్టారు. ఆగ్రహంతో ఫర్నీచర్‌ను ధ్వంసం చేసి వైద్యుడిపై దాడి చేయడంతో ఆస్పత్రి వద్ద ఉ ద్రిక్త పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలం చేరు కుని అదుపు చేయడానికి ప్రయత్నించినప్పటికి వారిపై దురుసుగా ప్రవ ర్తించడంతో పరిస్థితి అదుపు తప్పింది. బంధువులు తెలిపిన వివ రాల ప్రకారం పట్టణంలోని హాజీ పుర ప్రాంతానికి చెందిన నజిబుల్ రహిమాన్ అలియాస్ ఆటో ముజీబ్ (49) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం కొత్త బస్టాండ్ ఆటో స్టాం డ్ వద్ద ఉన్నట్టుండి సోమసిల్లి పడిపోయాడు. గమనించిన ఆటో యూనియన్ సభ్యు లు రహిమాన్‌ను పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి బంధువులు సమాచా రం అందించారు. ఆసుపత్రిలో ఉన్న సిబ్బంది రహిమాన్‌కు ప్రథమ చికిత్స చేసి వి ధుల్లో ఉన్న వైద్యుడికి సమాచారం అందించారు. చాలా సమయం తరువాత ఆస్ప త్రికి చేరుకున్న వైద్యుడు రహిమాన్‌ను చికిత్స చేసేందుకు ప్రయత్నించేలోపే రహి మాన్ అపస్మారక స్థితిలోకి వెళ్లి మృతి చెందాడు. రహిమాన్ మృతి విషయం తెలు సుకున్న బంధువులు, మిత్రులు వైద్యుడితో పాటు సిబ్బందిని నిలదీసారు. ఆగ్రహంతో ఆస్పత్రిలో ఉన్న ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. భయాందోళనకు గురైన డాక్టర్, సిబ్బం ది అక్కడే ఉన్న గదిలోకి వెళ్లి గడియ పెట్టుకున్నారు. దీంతో కోపోద్రులైన బంధువులు, తలుపులను బద్దలు కొట్టే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న కథలాపూర్ ఎస్‌ఐ నవీన్ తన సిబ్బందితో అక్కడి చేరుకుని ఆందోళన కారులను సమాదాయించే ప్రయత్నం చేసినా వారిపై బంధువులు దురుసుగా ప్రవర్తించారు. కోపోద్రులైన రహి మాన్ మిత్రులు తమతో తచ్చుకున్న కిరోసిన్ ఆసుపత్రిలో చల్లి అంటించే ప్రయత్నం చేసారు. గమనించిన పోలీసులు వారించి అక్కడి నుంచి చెదరగొట్టారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆస్పత్రి వద్దకు పెద్ద ఎత్తున జనం తరలిరావడంతో మరింత ఉద్రిక్తత నెలకొంది. డ్యూటీలో ఉన్న వైద్యుడు బయటకు రావాలని ఆందోళనా కారులు పట్టుబట్టారు. దీంతో పోలీసులు వైద్యుడిని పోలీసులు స్టేషన్‌కు ఆటోలో తరలిస్తుండగా ఆటోను అడ్డుకునా వైద్యుడిపై దాడి చేశారు. వెంటనే పోలీ సులు వారించి ఎట్టకేలకు పోలీసు స్టేషన్‌కు తరలించారు. రహిమాన్ మృత దేహంతో బంధువులు ఆసుపత్రి ఆవరణలో ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విషయం పోలీసు ఉన్నతాధికారుల వరకు వెళ్లడంతో మెట్‌పల్లి డీ ఎస్పీ ఉమామహేశ్వర్ రావు కోరుట్ల సీఐ సురేష్ బాబు, మేడిపల్లి, మెట్‌పల్లి ఎస్‌ఐ శ్యాంరాజు, చిరంజీవి సంఘటన స్థలం వద్దకు చేరుకుని పరిస్థితి సమీక్షించారు. విచారణ చేపట్టి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. రహిమాన్ ఎండ తీవ్రత్తకు మృతి చెంది ఉంటాడని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఇదిలా ఉండగా రహిమాన్ భార్యతో పాటు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నాడు. పెద్ద కూతురు వివాహం ఈ నెల 17వ తేదీన ఉన్నట్లు బంధువులు తెలిపారు.

విరిగిపడిన వృక్షం

- మూడు వాహనాలు ధ్వంసం



ధ్వంసమైన వాహనం

వేములవాడ, మే 5 : వేములవాడ పట్టణంలోని పార్వతీపురం వసతి గదుల వెనుక భాగంలో గల వీఐపీ రోడ్డులో ఆదివారం నాడు చెట్టు విరిగి పడిన ఘటనలో మూడు వాహనాలు ధ్వంసం అయ్యాయి. నటరాజ విగ్రహం నుండి గుడి చెరువుకు వెళ్లే మార్గంలోని విఐపి రోడ్డులో ఏండ్ల నాటి చింత చెట్టు కింది భాగం మొత్తం పుచ్చిపోయి ఆదివారం నాడు ఒకసారిగా కుప్పకూలి పడిపో యింది. చెట్టు నీడ ఉండడంతో అక్కడ పార్కు చేసి ఉంచిన వాహనాల పై పడడంతో పాక్షికంగా ధ్వంసమయ్యాయి. పోలీస్ శాఖకు చెందిన డాగ్ స్క్వాడ్ సిబ్బంది అదే సమయంలో అక్కడికి చేరుకుని వాహనం నుంచి దిగి ప్రధాని పర్యటన నేపథ్యంలో తనిఖీలు నిర్వహిస్తుండగా, రోడ్డు మధ్యలో ఉన్న పోలీసు వాహనంపై పడడంతో వాహనం ధ్వంసం అయింది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదు. ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఉద్యోగం లేదని మనస్తాపం.. యువకుడి ఆత్మహత్య



లవన్‌కుమార్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, మే 5: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌కు చెందిన ఆకుల లవన్‌కుమార్(25) ఉద్యోగం లేదనే మనస్తాపంతో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. రాచర్ల బొప్పాపూర్ గ్రామానికి చెందిన లవన్ కుమార్ హైదరాబాద్‌లో ఇటీవల ఎంబీఏ పూర్తి చేశాడు. ఉద్యోగం లేకపోవడంతో ఇంటి వద్ద ఉంటున్నాడు. గత నెల 7న పక్కింటివారి కూలర్ తన ఇంటికి తీసుకొచ్చాడు. కూలర్ ఎందుకు తీసుకొచ్చావంటూ తల్లి మందలించింది. దీంతో అదే రోజు రాత్రి ద్విచక్ర వాహనంపై హైదరాబాద్‌కు వెళ్లాడు. ఉద్యోగం లేదని బాధపడుతూ అప్పటి నుంచి తల్లితో ఫోన్ సరిగా మాట్లాడడం లేదు. ఆదివారం ఉదయం బొప్పాపూర్ గ్రామ సమీపంలోని జక్కుల చెరువు వద్ద ద్విచక్ర వాహనం, చెప్పులను గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. చెరువులో మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు స్థానికుల సహాయంతో బయటకు తీశారు. చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుని కాగా లవన్‌కుమార్ తల్లి తన కొడుకు మృతిపై అనుమానం వ్యక్తం చేసింది. తల్లి వనజ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ పేర్కొన్నారు.

వన్య ప్రాణుల సంరక్షణకు చర్యలేవి

- దాహార్తి తీరక వన్య ప్రాణులు విలవిల



మరిమడ్లలో ఖాళీగా ఉన్న నీటి తొట్టిలు

కోనరావుపేట, మే 5: వన్యప్రాణులను సంరక్షించాలని అధికారులు చెబుతున్నప్పటికీ అటవీ శాఖ అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వేసవిలో వన్యప్రాణులు దాహార్తి తీర్చుకోవడానికి అటవీ ప్రాంతం నుండి జనవాసంలోకి వచ్చి కుక్కల దాడిలో మృతి చెందుతున్నాయి. అడవి జంతువులను కాపాడడానికి అడవి ప్రాంతంలో నీటి తొట్టిలను అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. కానీ వాటిలో నీటిని నింపకపోవడంతో వన్యప్రాణులు దాహార్తి తీర్చుకోవడం కోసం ఇబ్బందులు పడుతున్నాయి. నీటి తొట్టిలను ఏర్పాటు చేసిన సమయంలో నీళ్లు నింపి మళ్లీ నీళ్లు పోయకపోవడంతో వేసవిలో అడవి జంతువులకు ఇబ్బందులు తప్పడం లేదు. కోనరావుపేట మండలంలోని శివంగాలపల్లి, మరిమడ్ల అటవీ ప్రాంతాల్లో అటవీ శాఖ అధికారులు నీటి తొట్టిలను ఏర్పాటు చేశారు. కానీ వాటిలో అధికారులు నీరు నింపడంలో మర్చిపోయారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు స్పందించి ఎప్పటికప్పుడు నీటి తొట్టిలో నీరు నింపాలని ప్రజలు కోరుతున్నారు.

'సన్'డే

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దంచి కొడుతున్న ఎండలు
జగిత్యాల జిల్లా వెల్గటూరులో రాష్ట్రంలోనే అత్యధికంగా 47.1 డిగ్రీలు
పలు చోట్ల 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు
ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. పలుచోట్ల 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం తొమ్మిది గంటల వరకే ఉష్ణోగ్రతలు పెరిగిపోతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి.

జగిత్యాల టౌన్, మే 5: రెండు, మూడు రోజులుగా జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగిపోతున్నాయి. జిల్లాలో ఆదివారం రాష్ట్రంలోనే అత్యధికంగా వెల్గటూర్ మండల కేంద్రంలో 47.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇబ్రహీంపట్నం మండలం గోధూర్‌లో 46.8, రాయికల్ మండలం అల్లీపూర్‌లో 46.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మరో ఎనిమిది ప్రాంతాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో వాతవరణ శాఖ వరుసగా రెండో రోజు జిల్లాను రెడ్ అలర్ట్‌గా ప్రకటించింది. అవసరమైతే తప్పా బయటకు వెళ్లవద్దని, అత్యవసర పరిస్థితుల్లో జాగ్రత్తలు పాటించాలని పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసింది. ధర్మపురి మండలం బుద్దేశ్‌పల్లిలో 45.6, వెల్గటూర్ మండలం గుల్లకోట, ధర్మపురి మండలం జైనలో 45.5 డిగ్రీలు, బీర్‌పూర్ మండలం కొల్వాయిలో 45.3, రాయికల్ మండల కేంద్రంలో 45.1, మెట్‌పెల్లి పట్టణంలో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో రాత్రి 10 దాటిన తర్వాత కూడా ఉక్కపోతలు తప్పకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.



జగిత్యాలలో తలకి రుమాలు కట్టుకుని వెళుతున్న ప్రయాణికులు



గొడుగు పట్టుకుని దోసకాయలు విక్రయిస్తున్న మహిళ



జన సంచారం లేక వెల వెలబోతున్న వీణవంక బస్టాండు ప్రాంతం

● **వీణవంక:** మండలంలో వరుసగా నాలుగో రోజు ఉష్ణోగ్రతలు తగ్గలేదు. ఆదివారం మండలంలో 46.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైంది. ప్రతి రోజు ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదు కావడంతో వీణవంక బస్టాండ్ ప్రాంతం జన సంచారం లేక వెలవెలబోయింది.

● **సిరిసిల్ల:** వడగాలులు, ఎండ తీవ్రతతో ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సెలవు దినం కావడంతో అందరూ ఇళ్లకే పరిమితం అయ్యారు. జన సంచారం లేక జిల్లా కేంద్రంలోని రోడ్లు వెలవెలబోయాయి. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఉష్ణోగ్రత 44.7, చందుర్తిలో 44.6, ఇల్లంతకుంటలో 44.3, గంభీరావుపేటలో 44.1, వేములవాడలో 44, వీర్నపల్లిలో 43.9, వేములవాడ రూరల్‌లో 43.9, బోయినపల్లిలో 43.7, తంగళ్లపల్లిలో 43.4, రుద్రంగిలో 43.4, ఎల్లారెడ్డిపేటలో 42.9, కోనరావుపేటలో 42.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

విద్యారంగాన్ని పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం

- రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి



మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 5: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అన్నారు. ఆదివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ధనవంతుల కొమ్ముకాస్తుందన్నారు. అదానీ, అంబానీల అప్పులను మాఫీ చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. రాష్ట్రం నుంచి లక్షల రూపాయలు టాక్స్‌ల రూపంలో తీసుకున్న కేంద్రం అంతర్జాతీయ ప్రామాణాలతో ఒక్క ఆసుపత్రిని కూడా నిర్మించలేదన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడంలో విఫలమయ్యారని విమర్శించారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి విస్మరించారన్నారు. జనాభాలో 60 శాతం ఉన్న బీసీల కుల గణన చేయాలని కోరితే బీజేపీ వ్యతిరేకించిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వ్యతిరేకమని ఆరోపించారు. అనంతరం ప్రొఫెసర్లు పద్మజ, లక్ష్మినారాయణ మాట్లాడుతూ మోదీ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఈ సమావేశంలో కొరివి వేణుగోపాల్, కందుకూరి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

● విభజన రాజకీయాలు చేస్తున్న బీజేపీ

విద్వేష, విభజన రాజకీయాలు చేస్తున్న బీజేపీని ఓడించాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అన్నారు. ఆదివారం నగరంలోని ఎస్‌ఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో వాకర్స్‌తో మాట్లాడారు. అనంతరం రైతుబజార్‌లో జాగో తెలంగాణ, తెలంగాణ ప్రజాస్వామిక వేదిక ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నైనాల గోవర్ధన్, రాయిదాస్ రాయ్, మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం హన్మేశ్, కొరివి వేణుగోపాల్, పిడిఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వి శ్రీకాంత్, డిబిఎఫ్ పులి కల్పన, స్వరూప, సౌజన్య, రాణా ప్రతాప్, అంజి, తిరుపతి, కుమారి, గౌస్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

● బీజేపీతో రాజ్యాంగానికి ముప్పు

మానకొండూర్, మే 5: కేంద్రంలో మరోసారి మోదీ సర్కార్ అధికారంలోకి వస్తే రాజ్యాంగానికి ముప్పు వాటిల్లుతుందని మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అన్నారు. ఆకునూరి మురళి ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర ఐదో రోజు ఆదివారం మానకొండూర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరంకుశ కేసీఆర్ పాలనను తెలంగాణ ప్రజలు ఓడించారని అన్నారు. 2014 లో జరిగిన ఎన్నిక సందర్భంగా నరేంద్ర మోదీ ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారం చేపట్టినా దాని ఊసే లేదని విమర్శించారు. 2018లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకాన్ని ప్రవేశపెట్టి ఇల్లు లేని నిరుపేదలందరికీ సొంత గృహం ఉండేలా చూస్తామని చెప్పారని తెలిపారు. బీజేపీకి 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని ఆపార్టీ నేతలు బహిరంగంగానే మాట్లాడుతున్నారని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ ప్రజలు బీజేపీకి ఓటు వేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బస్సుయాత్ర బృందం సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



మనోహర్(ఫైల్)

కరీంనగర్ క్రైం, మే 5 : కరీంనగర్ రూరల్ మండలం తీగలగుట్టపల్లి బస్టాండ్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గంగాధర మండలం చర్లపల్లికి చెందిన దయ్యాల మనోహర్(23) చెందాడని పోలీసులు తెలిపారు. మనోహర్ చొప్పదండి నుంచి గంగాధరకు బైక్‌పై వెళ్తుండగా తీగలగుట్టపల్లి బస్టాండ్ వద్ద ఆగి ఉన్న కారును వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో కారు పక్కన నిలుచున్న ముగ్గురు వ్యక్తులకు గాయాలు కాగా మనోహర్ తలకు తీవ్రగాయాలయ్యాయి. మనోహర్‌ను ఆసుపత్రికి తరలించగా ఆదివారం ఉదయం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణ మైన రోడ్డుపై పార్క్ చేసిన కారు యజమానిపై చర్యలు తీసుకోవాలని మృతుడి తండ్రి మల్లయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బెదిరింపులకు పాల్పడిన ఇద్దరిపై కేసు

జమ్మికుంట రూరల్, మే 5: ఇళ్లు, ఖాళీ స్థలం అమ్ముతామని నమ్మబలికి ఓ మహిళ వద్ద డబ్బులు తీసుకోని బెదిరింపులకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులపై పోలీస్‌లు ఆదివారం కేసు నమోదు చేశారు. జమ్మికుంటకు చెందిన రావుల తిరుపతి, రావుల రాజేందర్ అనే వ్యక్తులు హుజూరాబాద్ మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన బెల్లం వసంతకు ఇళ్లు, 30గుంటల ఖాళీ స్థలం అమ్ముతామని చెప్పి పథకం ప్రకారం డబ్బులు వసూళ్లు చేశారు. తీరా రిజిస్ట్రేషన్ సమయం వచ్చే సరికి ఏం చేసుకుంటారో చేసుకో అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసిందని, ఇద్దరి వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన ఒకరిపై కేసు

వీణవంక, మే 5:మండల కేంద్రంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆత్మీయ సమ్మేళనం ముగించుకొని జగిత్యాల సభకు బయలు దేరి వెళ్తుండగా భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ సందర్భంగా అనుమతి లేకుండా బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఏజెంటు మొలుగు పూర్ణచందర్ టపాకాయిలు కాల్చినందుకు ఎఫ్ఎస్‌టీటీం (ఎన్నికల అధికారి)ఇన్‌చార్జి నగరీతి రాంకూమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పూర్ణచందర్ పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తిరుపతి తెలిపారు. ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్సై సూచించారు.

మరమగ్గాల కార్మికులకు యారన్ సబ్సిడీలను అందించాలి

సిరిసిల్ల రూరల్, మే 5: సిరిసిల్లలో బతుకమ్మ చీరలను తయారు చేసిన మరమగ్గాల కార్మికులకు రావాల్సిన పది శాతం యారన్ సబ్సిడీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అందించాలని సీఐటీయూ తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్ భద్రావతి సొసైటీ వద్ద ఆదివారం సీఐటీయూ పవర్ లూం వర్కర్స్ యూనియన్ వార్డుల ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరమగ్గాల కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పెద్ద ఎత్తున ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవడంలో భాగంగా ఈ నెల 8వ తేదీన సాయంత్రం 4గంటలకు నెహ్రూనగర్‌లోని భవాని ఫంక్షన్‌హాల్‌లో మరమగ్గాల కార్మికుల విస్తృత స్థాయి సమావేశాన్నిఏర్పాటు చేశామని చెప్పారు. ప్రస్తుతం జరిగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీని ఓడించాలని కార్మిక చట్టాలు హక్కుల రక్షణ కోసం ఇండియా కూటమిలో భాగస్వామి అయిన కాంగ్రెస్ కూటమికి పవర్‌లూం వర్కర్స్ యూనియన్ పూర్తిస్థాయిలో మద్దతు తెలుపుతోందని తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, నాయకులు గుండు రమేష్, సబ్బని చంద్రకాంత్, కంది మల్లేశం, బెజుగం సురేష్, సదానందం, దశరథం, దామోదర్, గణేష్, విజయ్, ప్రసాద్, తిరుపతి, పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో మాట్లాడుతున్న నాయకులు

వడదెబ్బతో ఇద్దరి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

జమ్మికుంట/ఇల్లందకుంట, మే 5: జమ్మికుంట పరిధిలో వేర్వేరు చోట్లు ఆదివారం వడ దెబ్బ తగిలి ముగ్గురు మృతి చెందారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో గల ఆదర్శనగర్ రైల్వే ట్రాక్ పక్కన ఓ వ్యక్తి ఎండ తీవ్రతతో ఆదివారం మృత్యువాత పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఇల్లందకుంట మండలం చిన్నకోమటిపల్లి గ్రామానికి చెందిన మూడెడ్ల రాజయ్య (50) మతి స్థిమితం కోల్పోయి వారం రోజుల క్రితం ఇంటి నుండి బయ టకు వచ్చాడు. ఊరూరా భిక్షాటన చేస్తూ, కొత్తపల్లిలోని రైల్వే ట్రాక్ పక్కన ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు ఏరుకుంటున్నాడు. కాగా ఆదివారం రైల్వే ట్రాక్ పక్కన మృత్యువాత పడి ఉన్నాడు. ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్లగా, ఎండ తీవ్రతతో మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు. కాగా జమ్మి కుంట రైల్వే స్టేషన్‌లోని ఫస్ట్ ప్లాట్ ఫారమ్‌పై గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. మృతుడి వయస్సు 50- 60సంవత్సరాల మధ్య ఉంటుంది. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు, గుర్తింపు కార్డులు లభించలేదు. అనారోగ్యం, వడ దెబ్బతో మృతి చెంది ఉంటాడని రైల్వే పోలీస్ లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. పోస్టుమార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని జమ్మికుంట ప్రభు త్వ ఆస్పత్రిలో భద్ర పరిచినట్లు రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ధర్మారం, మే 5: ధర్మారం మండలం బంజేరుపల్లిలో కల్లోల వెంకయ్య(40) అనే వ్యక్తి శనివారం రాత్రి మద్యం మత్తులో విషగుళిలు మింగగా, కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడని ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా జలదంకి మండల కేంద్రానికి చెందిన వెంకయ్య 15రోజుల క్రితం పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం బంజేరుపల్లి గ్రామంలో భవన నిర్మాణాలకు కూలి పని చేయడానికి వచ్చాడు. శనివారం రాత్రి వెంకయ్య మద్యం తాగిన మత్తులో విష గుళికలు మింగాడు. అతని కరీంనగర్ ఆసుపత్రికి తరలింగా చికిత్స పొందుతూ అదేరాత్రి మృతిచెందాడని మృతుడి భార్య వెంగమ్మ ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

వీణవంకలో యువకుడు..

వీణవంక, మే 5: పురుగుల మందు తాగిన మండలంలోని కోర్కల్ గ్రామానికి చెందిన పూదరి కుమార్ (38) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివ రాల ప్రకారం.. కుమార్ కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. తరుచూ తనకు పెళ్లి కావడం లేదని తెలిసిన వారితో చెప్పుకుంటూ బాధప డేవాడు. మనస్తాపం చెందిన కుమార్ శనివారం పురుగుల మందు తాగాడు. స్థానికులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతు మృతి చెందాడు. కుమార్ తల్లి పూదరి ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకిరికి తీవ్రగాయాలు

మానకొండూర్, మే 5: మండలం ముంజంపల్లి శివారులో గల జాలగుట్ట వద్ద ఆదివారం మోటార్ సైకిలిస్టు అదుపు తప్పి పడిపోయిన సంఘటనలో ఒకరికి తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన ఓరుగంటి సురేష్ అనే వ్యక్తి వ్యక్తి గత పనిపై మోటార్ సైకిల్‌పై కరీంనగర్‌కు వెళ్లుతున్నాడు. జాలగుట్ట వద్ద అదుపుతప్పిపడిపోవడంతో తీవ్రగాయలు అయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

ప్రశాంతంగా నీట్ ప్రవేశ పరీక్ష

- జిల్లాలో 5 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు
- 3,466 మంది విద్యార్థులు హాజరు



పరీక్ష రాసేందుకు క్యూ లైన్‌లో వెళుతున్న విద్యార్థులు

తిమ్మాపూర్, మే 5: దేశవ్యాప్తంగా వైద్య, విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్(నీట్ ప్రవేశ పరీక్ష) ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నీట్‌పరీక్ష కోసం జిల్లా వ్యాప్తంగా 5 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. కరీంనగర్‌లోని వివేకానంద రెసిడెన్షియల్ పాఠశాలలో 828 మంది విద్యార్థులకు గాను 811 మంది హాజరయ్యారు. వివేకనంద డిగ్రీ, పీజీ కాలేజీలో 792 మందికి గానూ 778 మంది, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 480 మందికి గానూ 469 మంది పరీక్ష రాశారు. తిమ్మాపూర్ మండల కేంద్రంలోని శ్రీ చైతన్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజికల్ సైన్సెస్ పరీక్ష కేంద్రంలో 720 మందికి 706 మంది, వాగేశ్వరి కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ పరీక్ష కేంద్రంలో 720 మందికి 702 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. మొత్తంగా జిల్లా వ్యాప్తంగా 3,540 మంది విద్యార్థులకు గానూ 3,466 మంది పరీక్ష రాశారు. కాగా 74 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని నీట్ అర్హత పరీక్ష సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ టి లతితాకుమారి తెలిపారు. ఈ పరీక్ష మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5.20గంటల వరకు ఒకే షిఫ్టులో పెన్ను పేపర్ విధానంతో నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచే విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. ఒక్క నిమిషం నిబంధన కారణంగా పరీక్షకు ఆరగంట ముందు నుంచే విద్యార్థులను లోనికి అనుమతిం చలేదు. తమ వెంట పాస్‌పోర్ట్ సైజు ఫోటోను అతికించిన అడ్మిట్ కార్డు, ఏదైనా గుర్తింపు కార్డు ఉంటేనే అభ్యర్థులను లోనికి అనుమ తించారు. ఫోటోలు వెంట తీసుకురాని కొందరికి పరీక్ష కేంద్రాల్లోనే అందజేసే ఏర్పాటు చేశారు. గుర్తింపు కార్డు వెంట తీసుకురాని ఒకరిద్దరిని పరీక్ష రాసేందుకు అనుమతించలేదు. మొబైల్‌తో సహా ఇతర ఎలాక్ట్రానిక్ వస్తువులను, షూస్ వంటి వాటిని అధికారులు పరీక్ష కేంద్రాంలోనికి అనుమ తించలేదు. ఏండలు తీవ్రంగా ఉన్నప్పటికీ పరీక్షా కేంద్రాల్లో ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



రూం నంబరు చూసుకుంటున్న విద్యార్థులు

నేడు నడ్డా.. రేపు రాజస్థాన్ సీఎం సభలు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి

మంథని, మే 5: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పెద్దపల్లిలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా బహిరంగ సభ సోమవారం, మంథనిలో మంగళవారం రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ బహిరంగ సభను ఏర్పాటు చేసినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి ఆదివారం తెలిపారు. పెద్దపల్లి బీజేపీ గెలుపే లక్ష్యంగా నడ్డా, భజన్‌లాల్‌శర్మలు పర్యటిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో జరిగే సభలో నడ్డా, మంథనిలోని ఇండేన్ గ్యాస్ గోదాం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో జరిగే సభలో భజన్‌లాల్‌శర్మలు పాల్గొని ప్రసంగిస్తారన్నారు. ఈ రెండు సభలను విజయవంతం చేయటానికి బీజేపీ శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు.

ఈశ్వర్ మద్దతుగా ప్రచారం

ఎలిగేడు, మే 5 : మండలంలోని లోకపేట, ముప్పిరితోట, రాములపల్లి, ర్యాకల్‌దేవ్‌పల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ మద్దతుగా మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ తానిపర్తి స్రవంతిమోహన్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు మద్దతు

కోల్‌సిటీటౌన్, మే 5: బీఆర్ఎస్ పార్టీకి దళిత సామాజిక హక్కుల పరిరక్షణ సమితి మద్దతును తెలుపుతూ ఆ పార్టీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని ఆదివారం గోదావరిఖని లక్ష్మీనగర్, ప్రధానచౌరస్తాలో ప్రచారం చేశారు. సమితి జిల్లా అధ్యక్షులు చిలుక ప్రసాద్, నాయకులు కనుకుంట్ల రమేష్, యుగందర్, స్వామి, చలిగంటి పోచం, దామోదర్, అంజయ్య పాల్గొన్నారు.

మంథని సభను విజయవంతం చేయండి

రామగిరి, మే 5: మంథనిలో ఈనెల 7న నిర్వహించే సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంథనిలో నిర్వహించే సభకు రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్‌శర్మ ముఖ్యఅతిథిగా హాజరు అవుతున్నట్లు తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు మోల్మూరి శ్రీనివాస్, నాయకులు సత్యప్రకాశ్, నాంపల్లి రమేశ్, సతీష్ తీగల శ్రీధర్, దొంతుల సురేష్, తొట్లరాజు, లక్ష్మణ్, శ్రీకాంత్, ధీరజ్, పిడుగు రాజు, కొప్పుల క్రాంతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొప్పులకు మద్దతుగా ప్రచారం

ధర్మారం, మే 5: పెద్దపల్లి ఎంపీ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ గెలుపు కోసం బీఆర్ఎస్ నాయకులు ఆదివారం ఉదయం మండలంలోని రామయ్యపల్లిలో నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీగా కొప్పుల ఈశ్వర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నాయకులు కోరారు. ఈప్రచార కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

గులాబీ జెండా ఎగురవేయాలి

మంథని, మే 5: పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి గడ్డపై గులాబీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ముందుకు సాగాలని జడ్పీ చైర్మన్ బీఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధు సూచించారు. ఆదివారం జరిగిన మంథని నియోజకవర్గంలోని అన్ని మండలాల ముఖ్య నాయకులతో పుట్ట మధు సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ గెలుపు కోసం పనిచేయాలన్నారు.

బడుగుబలహీన వర్గాల పార్టీ కాంగ్రెస్..

పాలకుర్తి, మే 5: పేద, బడుగుబలహీన వర్గాల అభ్యున్నతికి నిత్యం పాటుపడే ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు అన్నారు. ఆదివారం మండలంలో జరిగిన పార్లమెంటు ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఈనెల 13న జరగనున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కేశోరాం కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సూర సమ్మయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొప్పుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

పెద్దపల్లి రూరల్, మే 5 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని అప్పన్నపేట, బొంపల్లి, తుర్కల మద్దికుంట గ్రామాల్లో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించిన వారితో మాజీ ఎమ్మెల్యే సమీక్షించారు. సమావేశాల్లో వైస్ఎంపీపీ ముత్యాల రాజయ్య, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మార్కు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణ గెలవాలని పూజలు

ఓదెల, మే 5 : పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ భారీ మెజార్టీతో గెలుపొందాలని భ్రమరాంబ మల్లిఖార్జునస్వామి ఆలయం రామాలయంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్య ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మల్లన్న ఆశీస్సులతో గడ్డం వంశీ భారీ మెజార్టీతో గెలుపొందుతున్నారన్నారు. యువ నాయకత్వానికి మంచి భవిష్యత్ ఉన్నందున యువకుడైన గడ్డం వంశీని గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలని ప్రజలను కోరారు. అలాగే కొలనూర్‌కు చెందిన సామ రాజేందర్, మరో ఇద్దరు కలిసి గడ్డం వంశీ గెలుపు కోసం ఇదే ఆలయంలో మంచిర్యాల వరకు సైకిల్ యాత్ర నిర్వ హించారు. కాంగ్రెస్ నాయకులు కోట సత్యనారాయ ణరెడ్డి, ముద్దమళ్ల రమేష్, లేదిరి మల్లేష్, జంగం కోమురయ్య, పెద్దిరెడ్డి రాజిరెడ్డి, ఐలయ్య, తిరుపతి, అశోక్, శ్రీనివాస్, పాల్గొన్నారు.



రామాలయంలో మొక్కులు తీర్చుకుంటున్న నాయకులు

రం నిర్వహించారు.గడ్డం వంశీ చేతి గుర్తుకు ఓటెయ్యాలని ఓటర్లను అభ్యర్థించారు. మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, ఎంపీటీసీ రావి సదానందం, మాజీ సర్పంచ్ ఆటికం శంకరయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే న్యాయం

సుల్తానాబాద్, మే 5: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే పేదలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మార్కండేయ్య కాలనీలో ఆదివారం ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీ గెలుపు డిసైడ్ అయిపోందన్నారు. రోజురోజుకు బీఆర్ఎస్, బీజేపీ గ్రాఫ్ తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు, కౌన్సిలర్ చింతల సునితరాజు, అన్నయ్యగౌడ్, ప్రకాష్‌రావు, పన్నాల రాములు, రాజలింగం, సాయిరి మహేందర్, శ్రీగిరి శ్రీనివాస్, అబ్బయ్య గౌడ్, రాజయ్య, అమీనొద్దిన్, రవి, రాజేశం, పల్లా సురేష్, తిరుపతి, ఆసిఫ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

కాల్వశ్రీరాంపూర్, మే 5: మండలంలోని పందిళ్ల గ్రామంలో ఆదివారం గడపగడపకు కాంగ్రెస్ ప్రచారం నిర్వహించారు.

పెద్దపల్లి మండలంలో..

పెద్దపల్లి రూరల్, మే 5 : పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను అధిక మెజార్టీతో గెలిపించాలని మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు విస్తృత ప్రచారం చేపట్టారు. అందుగులపల్లిలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎండి గౌస్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. వారి వెంట నాయకులు సిద్ధ గట్టయ్య, బర్ల సదయ్య, పిట్టల సతీష్, చీకటి చంద్రయ్య, గుండా లక్ష్మీనారాయణ, అరె రవి, ఎంచర్ల అంజిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని ఆదరించండి

జైపూర్, మే 5 : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. ఆదివారం మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ముదిగుంట గ్రామంలో ప్రచారం నిర్వహించారు. అనంతరం గ్రామంలోని బీఆర్ఎస్ నాయకులు పలువురు కాంగ్రెస్‌లో చేరగా పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. చల్ల సత్యనారాయణరెడ్డి, విశ్వంభర్ రెడ్డి, ఫయాజ్, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి

బెల్లంపల్లి, మే 5 : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీని గెలిపించాలని బెల్లంపల్లి, చెన్నూరు ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, గడ్డం వివేక్‌లు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని కూరగాయల మార్కెట్,కాంటా చౌరస్తాలో ప్రచారం నిర్వహించారు. అంతకుముందు కాంటా చౌరస్తాలో నిత్య జనగణమన కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ వెంకట్రావు, మున్సిపల్ చైర్మన్ జక్కుల శ్వేత తదితరులు పాల్గొన్నారు.

వంశీకృష్ణకు ఏఐటీయూసీ మద్దతు

శ్రీరాంపూర్, మే 5: పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు ఏఐటీయూసీ మద్దతు తెలుపుతున్నట్లు యూనియన్ అధ్యక్షుడు వి.సీతారామయ్య పేర్కొన్నారు. ఆదివారం ఏఐటీయూసీ జనరల్ బాడీ సమావేశం యూనియన్ కార్యాలయంలో నిర్వహించారు. కార్మికుల సొంతింటి పథకం, పెర్క్స్‌పై ఆదాయపు పన్ను మినహాయింపు, నూతన భూగర్భ గనులు, తదితర సమస్యలు పరిష్కరిస్తే ఏఐటీయూసీ పూర్తి మద్దతు ప్రకటించి గడ్డం వంశీకృష్ణను గెలిపించే బాధ్యత తీసుకుంటుందని చెప్పారు. అనంతరం చెన్నూరు శాసనసభ్యుడు గడ్డం వివేక్ మాట్లాడుతూ, కార్మికుల సమస్యలన్నింటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. వంశీకృష్ణను ఎంపీగా గెలిపించాలని కోరారు. యూనియన్ సభ్యులు తీర్మానం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఏఐటీయూసీ ఉపప్రధాన కార్యదర్శులు కె. వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా, సీపీఐ నాయకులు రేగుంట చంద్రశేఖర్, జోగుల మల్లయ్య, రాచర్ల చంద్రమోహన్, అఫ్రోజ్‌ఖాన్ పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పూల్‌లో మునిగి కానిస్టేబుల్ మృతి

నస్పూర్, మే 5 : మంచిర్యాల జిల్లా నస్పూర్ పట్టణం సీసీసీ ఆర్‌కే-5 కాలనీలో సింగరేణి నిర్వహించే స్విమ్మింగ్ పూల్ ఈతకు వచ్చిన కానిస్టేబుల్ పంజాల సతీష్(41) నీటిలో మునిగి ఆదివారం ఉదయం మృతిచెందాడు. ఉదయం స్విమ్మింగ్‌కు వచ్చిన సతీష్ నీటిలో దూకగా పైకి రాకుండా నీటిలో మునిగినట్లు ఎస్సై రవి కుమార్ తెలిపారు. దూకిన వెంటనే పైకి తేలలేదని, బీపీ పెరగడం వలనే పైకి రాలేక నీరు మింగి అడుగున ఉండిపోయాడన్నారు. తోటి సహచరులు చుట్టుపక్కల చూడగా కనిపించకపోవడంతో నీటి అడుగున చూడగా కనిపించిన వెంటనే పైకి తీసి సీపీఆర్ చేశారు. అంబులెన్స్ ద్వారా మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి చికిత్స కొరకు తరలించారు. వైద్యులు పరీక్షలు చేసే లోపల సతీష్ చనిపోయాడు. కానిస్టేబుల్ బీపీ పెరిగి మెదడులో రక్తనాళాలు పగిలాయా.. గుండెపోటు గురై చనిపోయాడా అనే విషయం నిర్ధారించాల్సి ఉంది. 2013 బ్యాచ్‌కు చెందిన పంజాల సతీష్ మంచిర్యాల పట్టణ పోలీస్‌స్టేషన్ బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. మృతుడు సతీష్ స్వగ్రామం ఓదెల మండలం చానగొండ. కాగా గద్దెరాగడిలో ఇల్లు కట్టుకుని నివాసం ఉంటున్నాడు. సీసీసీలో సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించే ఈతకొలను (స్విమ్మింగ్ పూల్) సతీష్ ఫిబ్రవరి 16 నుంచి ఈతకు వస్తున్నాడు. మృతుడికి భార్య స్వప్న, కుమారులు రియాన్, రెషాన్‌లు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.



పంజాల సతీష్(ఫైల్)

రూ.కోటి 75 లక్షలకు పైగా నగదు జప్తు : కలెక్టర్

పెద్దపల్లిటౌన్, మే 5: పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో ఇప్పటివరకు కోటి 75లక్షల 38వేల 2030 రూపాయలను జప్తు చేసి, సరైన ఆధారాలు పరిశీలించి గ్రీవెన్స్ కమిటీ కోటి 64లక్షల 58వేల 232 రూపాయలను విడుదలచేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. రామగుండం అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 30లక్షల 65 వేల 2030 రూపాయలు, 74లక్షల 89వేల 137 రూపాయల విలువ చేసే 1042 గ్రాముల బంగారం, 6 లక్షల 13వేల 554రూపాయల విలువచేసే 6730 గ్రాముల వెండి జప్తుచేయగా, ఆధారాలను పరిశీలించి 24లక్షల 20వేల 190రూపాయలు విడుదల చేశామని, మంథని అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 11లక్షల 17వేల 330 రూపాయలు జప్తు చేయగా ఆధారాలను పరిశీలించి 6 లక్షల 81 వేల 830 రూపాయలు విడుదల చేశామన్నారు. పెద్దపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 17లక్షల 85వేల 500, ధర్మపురి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 32లక్షల 98 వేల 210రూపాయలు, చెన్నూరు అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 11లక్షల 7వేల 950 రూపాయలు, బెల్లంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 55లక్షల 88వేల 222, మంచిర్యాల అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 15లక్షల 76వేల 330రూపాయలు సీజ్ చేయగా, ఆధారాలను పరిశీలించిన గ్రీవెన్స్ కమిటీ పూర్తిస్థాయిలో నగదును విడుదల చేశాన్నారు. సరైన ఆధారాలు సమర్పించని కారణంగా 10లక్షల 80 వేల 540 రూపాయలు, 74లక్షల 89 వేల 137రూపాయల విలువచేసే 1042 గ్రాముల బంగారం, 6 లక్షల 13 వేల 554రూపాయల విలువ 6730 గ్రాముల వెండి ఆభరణాలు విడుదల చేయలేదని పేర్కొన్నారు.

విప్లవ సాంస్కృతిక ఉద్యమాన్ని బలోపేతం చేద్దాం

కళ్యాణ్‌నగర్, మే 5: విప్లవ సాంస్కృతిక ఉద్యమాన్ని బలోపేతం చేయాలని అరుణోదయ నాయకుడు బతుకుల రాజన్న, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు ఈ నరేష్ అన్నారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం గోదావరిఖని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో అరుణోదయ రామారావు వర్ధంతి సందర్భంగా రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. అరుణోదయ నాయకులు సిహెచ్ అబేద్నెగో, జనగామ బానే, కాసర్ల మల్లేష్, పీవైఎల్ జిల్లా అధ్యక్షులు కానిపేట ధర్మేందర్, ఐఎఫ్‌టీయు జిల్లా నాయకులు ఎడ్ల రవికుమార్, ఎం కొమరయ్య, బాలకృష్ణ, జనగామ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఆశీర్వదించండి

పెగడపల్లి, మే 5 : ఎమ్మెల్యేగా, ప్రభుత్వ చీఫ్ విప్‌గా, మంత్రిగా చేసిన అభివృద్ధి, చేపట్టిన సంక్షేమ పథకాలను చూసి తనను గెలిపించాలని పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. ఆదివారం పెగడపల్లి మండలంలోని ఎల్లాపూర్, బతికెపల్లి గ్రామాలలో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఇంటింటా తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ గోళి శోభాసురెందర్ రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్లు రమణారావు, వేణుగోపాల్, నాయకులు గంగాధర్ గౌడ్, లోక మల్లారెడ్డి, బండి వెంకన్న, రాజశేఖర్ గౌడ్, రాజేశ్వర్ రావు, కరుణాకర్ రావు, లక్ష్మణ్, రవి, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

తండ్రి కోసం తనయ ఇంటింటి ప్రచారం

పెగడపల్లి, మే 5 : పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ గెలుపు కోసం ఆయన తనయ నందిని ఆదివారం పెగడపల్లి మండలంలోని ఎల్లాపూర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా, చీఫ్ విప్‌గా, మంత్రిగా ఈ ప్రాంత అభివృద్ధికి కొప్పుల ఈశ్వర్ చేసిన కృషిని చూసి కారు గుర్తుకు ఓటు వేసి పార్లమెంట్ సభ్యుడిగా గెలిపించాలని ప్రచారం చేశారు.

నియామకం

ఎలిగేడు/సుల్తానాబాద్, మే 5: ఎలిగేడు పీఏసీఎస్‌లో కార్యదర్శిగా పనిచేస్తున్న కేశెట్టి విక్రమ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. ఆదివారం లంబులాద్రి టెంపుల్‌లో జరిగిన సమావేశంలో అధ్యక్షుడితో పాటు కార్యవర్గాన్ని ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా దాసరి ప్రసాద్, గౌరవ అధ్యక్షుడిగా గోలి అంజిరెడ్డి, ఉపాధ్య క్షుడిగా గీస సురేష్, క్యాషియర్‌గా కోలేటి శ్రీనివాస్, ముఖ్య సలహాదారుగా మెట్టు మదన్‌మోహన్, ప్రత్యేక ఆహ్వానితులుగా వల్లకొండ రమేష్, ప్రచార కార్యదర్శిగా నర్రా కిరణ్, రమణ, బోగే అశోక్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ అధ్యక్షుడు బొంగోని శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

'ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి'

పాలకుర్తి, మే 5: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల అవగాహన ప్రచార బృందం కళాకారులు తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని బసంత్‌నగర్ జీడినగర్ గ్రామంలో ఓటు హక్కు ప్రాముఖ్యతను పాటల రూపంలో వివరించారు. కార్యక్రమంలో దయా నర్సింగ్, గుండ్ల స్నేహలత, సానగొండ రవిందర్, మంథని స్పందన, నారగోని సరిత, జక్కుల స్వప్న, జన్నే శ్వేత, ఉప్పు స్పందన, మంథని వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

యైటింక్లయిన్‌కాలనీ, మే 5: శ్రీవాణి ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాల ఆవరణలో ఘనంగా జరిగింది. 1995-2002 బ్యాచ్‌ల పదో తరగతి విద్యార్థులు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. 23 ఏళ్ల తర్వాత చిన్ననాటి స్నేహితులను కలిసి ఆనందోత్సాహాల మధ్య గడిపారు. తమకు విద్య నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో కరస్పాండెంట్ లక్ష్మణ్‌కుమార్, ఉపాధ్యాయులు రేణుక, తిరుపతి, శ్రీనివాస్‌తో పాటు పూర్వ విద్యార్థులు సౌజన్య, రాజ్‌కుమార్, శ్రీనివాస్, రామకృష్ణ పాల్గొన్నారు.

అమృత కలశాల పంపిణీ

యైటింక్లయిన్‌కాలనీ, మే 5: సదాశయ ఫౌండేషన్, సత్యసాయి భక్తులు నిరుపేద కుటుంబాలకు ఆదివారం అమృత కలశాలను పంపిణీ చేశారు. మానవసేవయే మాధవ సేవ అనే సత్యసాయి చూపిన మార్గాన్ని అనుసరిస్తూ 15 నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులతో కూడిన అమృత కలశాలలను అందజేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కుటుంబానికి ఆకలి తీరేలా పప్పు, బియ్యం, చింతపండు వంటి 18 రకాల నిత్యావసర సరుకులు నెలకు సరిపడేలా అందజేస్తున్నట్టు తెలిపా రు. ఈకార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ గౌరవ సలహాదారు నూక రమేష్, సత్యసాయి భక్తులు సాన రామకృష్ణారెడ్డి, చందు, మోహన్, దేవారెడ్డి, రాజమహేందర్‌రెడ్డి, లింగమూర్తి, సాయి, శంకరయ్య, సీతారాం, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

సుల్తానాబాద్, మే 5: సుల్తానాబాద్ మండలంలోని కనుకుల గ్రామంలో తాళ్లపల్లి ఆగయ్య ఫౌండేషన్ వారు ఆదివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఫౌండేషన్ అధ్యక్షులు మనోజ్‌గౌడ్ చలివేంద్రాన్ని ప్రారం భించి ప్రజలకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మీస సత్తన్న, కర్రె కుమార్, కోట కుమార్‌రెడ్డి, తుమ్మ రాజేశం, కాందూరి వాసు, రాంచంద్రా రెడ్డి, రాంరెడ్డి, అంజయ్య, సది తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ఓటు హక్కును వినియోగించుకున్న పోలీసులు



ఓటు హక్కు వినియోగించుకున్న ఏసీపీ రమేష్

జ్యోతినగర్, మే5: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఆదివారం రామగుండం కమిషనరేట్‌కు చెందిన పోలీసులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించున్నారు. స్థానిక టీటీఎస్ జిల్లా పరిషత్ పాఠశాలలోని రామగుండం సెగ్మెంట్‌కు సంబంధించిన పోలింగ్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, రామగుండం సీఐ జి.అజయ్‌బాబు, సర్కిల్ పరిధిలోని ఎన్టీపీసీ, రామగుండం, అంతర్గాం ఎస్ఐలు టి.ఉదయ్‌కిరణ్, ఎస్.సతీష్, బి.వెంకటస్వామి, ఇతర పోలీసు అధికారులు, పోలీసులు ఓటు వేశారు. ఈ సందర్భంగా ఏసీపీ ఎం.రమేష్ మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహిస్తున్న పోలీసులందరూ పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

'మహాసభను విజయవంతం చేయండి'

మార్కండేయకాలనీ, మే 5: గోదావరిఖనిలో మంగళవారం జరిగే ఆటో కార్మికుల హక్కుల సాధన మహాసభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆటో రాష్ట్ర జేఏసీ అధ్యక్షుడు మంద రవికుమార్ ఆటో కార్మికులను కోరారు. రామగుండం నియోజకవర్గ నెంబర్ వన్ ఆటో అడ్డ అధ్యక్షులు మారుపాక శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం గోదావరిఖనిలో సమావేశం నిర్వహించగా ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మంద రవికుమార్ హాజరై మాట్లాడారు. ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్లకు రూ.25లక్షలు నష్టపరిహారం, ఇండ్లు లేని వారికి ఇల్లు తదితర అంశాలపై సభ కొనసాగుతుందన్నారు. హలో ఆటో-చలో గోదావరిఖని అనే నినాదంతో అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాతంగి శివరాజ్, పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి కాజీపేట రాజయ్య, అంబాల శంకర్ గోశిక చందర్ సతీష్, తల్లాడి లక్ష్మణా స్వామి, తేజ, రవి, ఎస్.కె ఇసుబ్, ప్రభాకర్, రమేష్, సత్యం, కుమ్మ రవి శంకర్, రాజయ్య, చంద్రయ్య, ఓదెలు, నాగరాజు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సహాయం

కమాన్‌పూర్, మే 5: మండల కేంద్రానికి చెందిన తోటపల్లి భూమయ్య క్యాన్సర్‌తో బాధపడుతుండగా, చికిత్స కోసం రూ.2లక్షల ఖర్చుతో కూడుకోగా, కుటుంబం నిరుపేదది కావడంతో విషయం తెలుసుకున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు స్పందించి ఆర్థిక సహాయాన్ని అందించి ఔదార్యాన్ని చాటుకున్నారు. రూ.లక్ష6వేల800 ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులకు అందజేశారు. హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు నారగొని సతీష్, మేడగొని విజయ్, మల్యాల విజయ్, సయ్యద్ జాకీర్, సీనియర్ జర్నలిస్టు జబ్బర్‌ఖాన్, నారగోని సరిత, గీసగొని శ్రీనివాస్, ఐలి వెంకటేశం, రెడ్డి చైతన్య, ఇనగంటి రోహిత్‌రావు, మల్యాల రమేష్, చెన్నూరి అభిలాష్, బుర్ర శ్రీనివాస్, కలువల రాకేష్, బొంగోని శ్రీనివాస్‌లు ఉన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

పెద్దపల్లి రూరల్, మే 5 : పెద్దపల్లి మండలం పెద్దకల్వల గ్రామ మాజీ సర్పంచ్ నర్ల లక్ష్మీ ఇటీవల మృతిచెందగా ఆదివారం పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి వారి కుటుంబాన్ని పరామార్శించారు. వెంట బీఆర్ఎస్ నాయకులు సలేంద్ర రాములు తదితరులు పాల్గొన్నారు.

నృత్య శిక్షణ కేంద్రం ప్రారంభం

సుల్తానాబాద్, మే 5: వేసవి సెలవులను పురస్కరిం చుకొని సుల్తానాబాద్ పట్టణంలో నటరాజ క్లాసికల్ డాన్స్ ఆకాడమీ వారిచే చిన్నారులకు కూచిపూడి నృత్య శిక్షణ కేంద్రాన్ని ఆదివారం ప్రారంబించారు. శిక్షణకు వచ్చిన చిన్నారులకు శిక్షకులు నాగమణి, శ్రీదేవిలు కూచిపూడి వంటి సంప్రదాయ నృత్యాలలోని పలు మెళకువలను తెలియజేశారు. లెక్కల సంతోష్, పడాల రాజకుమార్ పండితులు శ్రావణ్ కుమార్,పొలాస ప్రదీప్, కుర్న శ్రీధర్, బండారి కమలాకర్, సంజీవ్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఓసీపీల్లో పని సమయాల మార్పు విరుద్ధంగా ఉంది...

టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని, మే 5: సింగరేణి యాజమాన్యం ఎండల ప్రభావంతో ఓసీపీల్లో పని సమయాల మార్పు విరుద్ధంగా ఉందని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ఒక ప్రకటనలో అన్నారు. గతంలో వేసవి కాలంలో మొదటి షిప్టు ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఉంటే, ప్రస్తుతం ఆ సమయాన్ని ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు చేశారని, సెకండ్ షిఫ్టు గతంలో సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 11గంటల వరకు ఉంటే ప్రస్తుతం సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 12గంటల వరకు చేశారని, గతంలో 3వ షిఫ్టు రాత్రి 11గంటల నుంచి ఉదయం 7గంటల వరకు ఉంటే ఆ సమయాన్ని రాత్రి 11.30గంటల నుంచి ఉదయం 7.30గంటల వరకు చేశారని, ఇందులో పని సమయాలను పెంచారే తప్ప దీంతో కార్మికులకు ఒరిగిందేమి లేదని ఆరోపించారు. గత వేసవిలో మాదిరిగానే షిఫ్టుల సమయపాలన కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. దీనిపై సింగరేణి యాజమాన్యం పునరాలోచన చేయాలన్నారు.



బీజేపీని ఓడించండి: సీఐటీయూ

రామకృష్ణాపూర్, మే 5: బొగ్గుగనుల వేలం చట్టం తెచ్చిన బీజేపీని ఓడించాలని సీఐటీయూ నాయకులు అన్నారు. ఆదివారం రామకృష్ణాపూర్‌లోని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బ్రాంచ్ నాయకులు మాట్లాడారు. వెంకటస్వామి, రాజేందర్, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పనివేళలను వ్యతిరేకించిన ఐఎన్‌టీయూసీ

రామగిరి, మే 5: సింగరేణి ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓపెన్‌కాస్టు ప్రాజెక్టులో షిఫ్టు టైమింగ్‌ను ఐఎన్‌టీయూసీ వ్యతిరేకించింది. ఈ మేరకు ఆదివారం ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి మాట్లాడారు. ఎండ తీవ్రతను ఉన్న నేపథ్యంలో సింగరేణి కల్పించిన షిప్టు టైమింగ్స్‌ను పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఐడిల్ రన్‌లో డంపర్లలోని ఏసీలు పనిచేయడం లేదని, ఉష్ణోగ్రత తీవ్రత కారణంగా రెస్ట్ షెల్టర్‌లలో సైతం యంత్రాలపై పనిచేయడం కుదరడం లేదని ఆరోపించారు. ఉదయం 7నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 11గంటల వరకు షిప్టు మార్పు కోసం అధికారులతో మాట్లాడనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు గడ్డం తిరుపతి, బ్రాంచ్ సెక్రటరీ శ్రీనివాస్‌రావు, నాయకులు వెంకటస్వామి, సదానందం, మనోహర్, నరసింహచారి, మంగయ్య, సర్వనాయక్, మహమ్మద్‌రఫీ, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి

యాజమాన్యం ప్రకటించిన షిఫ్టు వేళలు సరికాదు

యైటింక్లయిన్‌కాలనీ, మే 5: షిఫ్టు వేళలను మారుస్తూ యాజమాన్యం ప్రకటించిన మార్పులను కార్మికుల సౌలభ్యం దృష్ట్యా సరిచేయాలని ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవీ రావు ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి షిఫ్టు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, రెండవ షిఫ్టు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు మూడవ షిఫ్టు రాత్రి 11గంటల నుంచి ఉదయం7గంటల వరకు మార్పులు చేస్తూ యాజమాన్యం జారీ చేసిన సర్క్యులర్ జారీ చేసిందని తెలిపారు. ఈ పనివేళలను తాము వ్యతిరేకిస్తున్నట్టు వైవీ రావు తెలిపారు. ఇటీవల ఓసీపీ-3 పర్యటనకు వచ్చిన సీఎండీకి ఏఐటీయూసీ పక్షాన పని వేళలను మార్చాలని వినతిపత్రం ఇస్తూ కార్మికులకు ఇబ్బంది కల్గకుండా ఉండే పనివేళలను సూచించామని, కానీ యాజమాన్యం ప్రకటించిన పని వేళలతో కార్మికులకు ఉపయోగం ఉండబోదని తెలిపారు. మొదటి షిఫ్టు 7నుంచి మధ్యాహ్నం 1గంటవరకు, రెండవ షిఫ్టు సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 11వరకు మార్పు చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల్లో కార్మికులు యాజమాన్యం సూచన ప్రకారం 6 గంటలకు కాకుండా 7 గంటలకు మస్టర్ పడాలని, సోమవారం సీఎండీతో మరోసారి చర్చించనున్నట్టు వైవీ రావు తెలిపారు. పెరిగిన ఎండల దృష్ట్యా కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పనివేళలను నిర్ణయించాల్సిన యాజమాన్యం, బాధ్యతారాహిత్యంగా ఎవరికి ఉపయోగపడని పని వేళలను నిర్ణయించిందని తెలిపారు.

'పని వేళల మార్పుపై దిగివచ్చిన యాజమాన్యం'

మందమర్రిటౌన్, మే 5: ఎండలు ఎక్కువగా ఉన్న దృష్ట్యా ఉద్యోగుల పనివేళలు మార్చాలని ఏఐటీయూసీ చేపట్టిన ఆందోళనలకు యాజమాన్యం దిగివచ్చి పనివే ళలు మార్చిందని ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, భీమనా ధుని సుదర్శన్ తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమం కోసం పోరాటాలు చేస్తామన్నారు. ఉద్యోగులు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ఆందోళనలు చేయగా యాజమాన్యం పనివేళలు మార్చిందని తెలిపారు.